BHARATH SAMACHAR DIGITAL

9, అక్టోబర్ 2026, శుక్రవారం భారత్ సమాచార్

అక్టోబర్ 24న సరూర్‌నగర్‌లో స్వర్ణకారుల మహాగర్జన



భారత్ సమాచార్, నిజామాబాద్ జిల్లా: స్వర్ణకారుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 24న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ‘స్వర్ణకార శంఖారావం మహాసభ’ నిర్వహించనున్నట్లు అఖిల భారత మహాసభ నిజామాబాద్ మహిళా అధ్యక్షురాలు మడుపు స్వప్న తెలిపారు. శనివారం సాయంత్రం 3 గంటలకు జరగనున్న ఈ మహాసభకు స్వర్ణకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

స్వర్ణకారుల కోసం నాలుగు ప్రధాన డిమాండ్లు

స్వర్ణకార వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ప్రధానంగా నాలుగు డిమాండ్ల సాధనకు కృషి చేస్తోందని మడుపు స్వప్న వివరించారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జీవో ఎంఎస్ నంబర్ 272ను సవరించి అమలు చేయడం ద్వారా అక్రమ కేసులను అరికట్టాలని కోరారు.

అలాగే, 50 సంవత్సరాలు నిండిన స్వర్ణకార వృత్తిదారులకు నెలకు రూ.5,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అప్రైజర్లు పనిచేస్తున్న అన్ని బ్యాంకుల్లో సీలింగ్ విధానాన్ని తొలగించి, వారికి సమానమైన కమిషన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలని పిలుపు

ఈ నాలుగు డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న స్వర్ణకార శంఖారావం మహాసభకు స్వర్ణకారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మడుపు స్వప్న కోరారు. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లా స్వర్ణకారులు ఐక్యంగా పాల్గొని తమ సమస్యలు, డిమాండ్లను బలంగా వినిపించాలని విజ్ఞప్తి చేశారు. స్వర్ణకారుల సంక్షేమం, వృత్తిదారుల హక్కుల సాధన దిశగా ఈ మహాసభ కీలక వేదికగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు.

© 2026 Bharath Samachar